నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | శుక్రవారం 12 జూలై 2024 | MAHABUBABAD

## ప్రేమించి.. పెళ్లి చేసుకున్న యువతి దక్కలేదని కక్ష

- వేట కొడవలితో యువతి తల్లిదండ్రులపై దాడి
- అక్కడికక్కడే తల్లి.. చికిత్స పొందుతూ తండ్రి మృతి
- అడ్డొచ్చిన యువతితో పాటు సోదరుడికి గాయాలు
- చెన్నారావుపేట మండలం 16 చింతలతండాలో ఘటన


మృతి చెందిన శ్రీను-సుగుణ (ఫైల్)

# ప్రేమోన్మాది ఘాతుకం


నిందితుడు నాగరాజు

చెన్నారావుపేట, జూలై 11 : ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి దక్కలేదని అతడు కక్ష పెంచుకున్నాడు. అదును కోసం కాపుకాసి ఉన్మాదిలా మారి ఆమె తల్లిదండ్రులను హతమార్చాడు. ఈ దారుణమైన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16 చింతలతండా గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ శ్రీనివాస్(40), సుగుణ (35) దంపతులకు కుమార్తె దీపిక, కుమారుడు మదన్‌లాల్ ఉన్నారు. దీపిక మండలంలోని అమీనాబాద్ మోడల్ పాఠశాలలో చదువుతున్న సమయంలో పాఠశాలకు తీసుకువెళ్లే గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బన్ని అలియాస్ నాగరాజుతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసి హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో నాగరాజు మాయమాటలు నమ్మిన దీపిక పెద్దలకు తెలియకుండా వివాహం చేసుకుంది. అప్పటికి దీపిక మైనర్ కావడంతో తల్లిదండ్రులు తమ కూతురిని మోసం చేసి నాగరాజు పెళ్లి చేసుకున్నాడని చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసుపెట్టారు. విచారించిన పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి పెద్దల సమక్షంలో విడాకులు ఇప్పించారు. అప్పటి నుంచి దీపిక తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్న నాగరాజు బుధవారం రాత్రి ఆరు బయట నిద్రిస్తున్న దీపిక తల్లిదండ్రులపై వేట కొడవలితో దాడి చేశాడు. అడ్డువచ్చిన దీపికతో పాటు ఆమె తమ్ముడు మదన్‌లాల్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో దీపిక తల్లి అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. తీవ్రంగా గాయపడిన దీపిక, మదన్‌లాల్‌ను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దాడి అనంతరం వేట కొడవలిని గూడూరు మండలం గుండెంగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిందితుడు పడేశాడు. విషయం తెలిసిన పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాగరాజు స్నేహితుడు పవన్‌ను పోలీసులు పట్టుకోగా స్థానికులు అతడిపై దాడికి యత్నించడంతో వారిని అడ్డుకొని చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా హత్య విషయం తెలిసిన తండా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. బాధితుల బంధువులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని, అప్పటి వరకు మృతదేహాలను తరలించొద్దని పట్టుపట్టడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. వరంగల్ డీసీపీ రవీందర్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి వెంట నెక్కొండ సీఐ చంద్రమోహన్, చెన్నారావుపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

**గుండెంగలో పోలీసుల బందోబస్తు**

గూడూరు : చెన్నారావుపేట మండలం 16 చింతలతండాలో జరిగిన జంట హత్యల నేపథ్యంలో గూడూరు మండలం గుండెంగలో పోలీసులు గురువారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హత్య చేసింది గుండెంగకు చెందిన ఆటో డ్రైవర్ నాగరాజు కావడంతో ముందస్తుగా గూడూరు సీఐ బాబురావు, ఎస్సై నగేశ్ రాత్రి వరకు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.


నర్సంపేటలోని అమరవీరుల జంక్షన్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల రాస్తారోకో

# నిందితుడిని ఉరితీయాలి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- పోలీస్‌స్టేషన్ ఎదుట మృతుల బంధువుల ఆందోళన
- మద్దతు ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


నర్సంపేటలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జూలై 11 : హత్యకు గురైన దంపతుల మృతదేహాలతో బంధువులు, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నర్సంపేట పోలీసుస్టేషన్ ఎదుట గురువారం రాస్తారోకో చేశారు. నిందితుడు మేకల నాగరాజును ఉరితీయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. న్యాయం జరిగేవరకూ కదిలేది లేదని రోడ్డుపై బైఠాయిచగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మద్దతు పలికారు. గురువారం ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంత ఘోరమైన ఘటన జరిగినా ప్రభుత్వం తరపున ఎవరూ రాకపోవడాన్ని తప్పుపట్టారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సొంత మండలంలో దంపతులు హత్యకు గురైతే మొఖం కూడా చూపలేదని, ఆయన స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కొత్త డీజీపీ చొరవ చూపి నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇద్దరు పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పెద్ది డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలోని అమరవీరుల జంక్షన్‌లో లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్, ఓడీసీఎంఎస్ నాయకులు గుగులోత్ రామస్వామినాయక్, పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, జడ్పీటీసీ సభ్యుడు బానోత్ పత్తినాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వాసునాయక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లాకు కేసీఆర్ ఆశీస్సులు

**పుట్టిన రోజు సందర్భంగా మాజీ సీఎంను కలిసిన రాజేశ్వర్‌రెడ్డి**

జనగామ, జూలై 11 (నమస్తే తెలంగాణ) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తన పుట్టిన రోజు సందర్భంగా సాయంత్రం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత నుంచి ఆశీస్సులు తీసుకున్నారు.


ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



హనుమకొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం


మహబూబాబాద్ రూరల్ : కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్న ప్రజలు

# సర్వర్ డౌన్.. రిజిస్ట్రేషన్లు బంద్..

## రోజంతా పని చేయని సర్వర్లు

- తప్పని పడిగాపులు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు
- సమస్య పరిష్కరించకపోవడంపై ఆగ్రహం
- సమయం, డబ్బులు వృథా అయ్యాయని సర్కారుపై అసహనం

హనుమకొండ/మహబూబాబాద్ రూరల్, జూలై 11 : సర్వర్ డౌన్ కావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగిపోయింది. దీంతో హనుమకొండ, మహబూబాబాద్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద జనాలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. భూముల అమ్మకాలు, కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు దూర ప్రాంతాల నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరుకొని అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రిజిస్ట్రేషన్లు ఎప్పుడు ప్రారంభమవుతాయో అధికారులు స్పష్టంగా చెప్పక పోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే వేచి ఉండి అవస్థలు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించి ఆ దిశగా కసరత్తు చేస్తుండడం, తిథులు మంచివి కావడంతో పెద్ద సంఖ్యలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు జనాలు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సర్వర్ డౌన్ కావడంతో వేచి ఉండాల్సి వస్తున్నదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య వస్తే వెంటనే స్పందించాల్సిన సర్కారు చర్యలు తీసుకోకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


కార్యాలయంలో కంప్యూటర్ల ముందు కూర్చున్న ఉద్యోగులు

**వరంగల్‌లో నిలిచిన 50 రిజిస్ట్రేషన్లు**

కాశీబుగ్గ : సర్వర్ సమస్యల కారణంతో పోచమ్మమైదాన్‌లోని వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. మధ్యాహ్నం నుంచి సర్వర్ డౌన్ అయి ఆధార్ లింకులు కాకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. దీంతో జిల్లాలోని వివిధ మండలాలల నుంచి వచ్చిన వారు సాయంత్రం వరకు వేచి చూసి నిరాశతో వెనుదిరిగిపోయారు. గురువారం 50కి పైగా రిజిస్ట్రేషన్లు నిలిచినట్లు తెలిసింది.

### హైదరాబాద్ నుంచి వచ్చారు..



మేము కొన్న భూమిని గురువారం రిజిస్ట్రేషన్ చేసుకుందామని ముందే నిర్ణయించుకున్నాం. మాకు భూమిని అమ్మిన వారు మా పేరుపై రిజిస్ట్రేషన్ చేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చారు. సెలవు పెట్టి, చిన్న పిల్లలను వదిలిపెట్టి ఉదయమే రిజిస్ట్రేషన్ ఆఫీసుకు మేము, వాళ్లు చేరుకున్నాం. తీరా ఇక్కడికి వచ్చే సరికి సర్వర్ డౌన్ అవడంతో రిజిస్ట్రేషన్లు కావడం లేదని తెల్సింది. రోజంతా సర్వర్ పని చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రిజిస్ట్రేషన్లు ఎప్పుడు ప్రారంభమవుతాయో అని ఎదురు చూపులతోనే ఇరువురి సమయం వృథా అయింది.

– చొల్లేటి వెంకట్‌రెడ్డి, కాట్రపల్లి

### కొడుకు పేరుపై రిజిస్ట్రేషన్ చేద్దామని వచ్చాను..



నా కొడుకు పేరున భూమి రిజిస్ట్రేషన్ చేద్దామని ఆఫీసుకు వత్తే అవుతలేవని తెల్సింది. దీంతో రోజంతా ఎదురు చూడాల్సి వచ్చింది. గిట్ల అయితే ఎట్లా.. మళ్లా రావాలంటే ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. నాకు కాళ్లు నొప్పులు ఉన్నాయి.. కట్టె పట్టుకొని నడుస్తున్నా. నాలాంటి వాళ్లకు ఇబ్బంది కదా.. ప్రభుత్వం ఇలా జరుకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి తిరిగి వెళ్లాల్సి వచ్చింది.

– ఈశ్వరమ్మ, ఎల్లాపూర్, హసన్‌పర్తి మండలం

### పొద్దటి నుంచి ఒక్క రిజిస్ట్రేషన్ కాలె..



పొద్దున పది గంటలకు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వచ్చాం. టోకెన్ ఇచ్చి కొంతసేపు ఉండమని చెప్పారు. మధ్యాహ్నం అయినా ఒక్క రిజిస్ట్రేషన్ కాలేదు. కారణం ఏంటో కూడా చెప్పడం లేదు. భోజనం చేయకుండా ఇక్కడే కూర్చున్నాం. సాయంత్రం ఆఫీస్‌లో సర్వన్‌డౌన్ ఉండడం వల్ల రిజిస్ట్రేషన్ కావడం లేదని, ఈ సమస్యకు పరిష్కారం మా చేతిలో లేదని అధికారులు ఆలస్యంగా చెప్పిండ్రు.

–టీ సత్యనారాయణ, తొర్రూరు

# డీఎస్సీ వాయిదా వేయాలి

- జనగామలో మోకాళ్లపై నిల్చొని నిరుద్యోగ జేఏసీ నిరసన
- కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలి
- జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు పిలుపు

జనగామ, జూలై 11 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీ వాయిదా వేయాలని కోరుతూ జనగామలో నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం యువకులు మోకాళ్లపై నిల్చొని వినూత్న నిరసన తెలిపారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, డీఎస్సీ వాయిదా వంటి అంశాలపై కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ నిలదీయాలని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తమకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని 33 లక్షల మంది నిరుద్యోగులు ఆ పార్టీని గెలిపించారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇప్పుడు నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లకు అమ్ముడు పోయారని వ్యాఖ్యానించడాన్ని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ తీవ్రంగా ఖండిస్తున్నదని రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ, కేయూ జేఏసీ నాయకులు గన్ను కార్తీక్, ఆసర్ల సుభాష్ మాట్లాడుతూ.. డీఎస్సీకి చదువుకోవడానికి సమయం ఇవ్వాలని అంటుంటే పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ పథకాల అమలు విషయంలో ఎందుకు సమయం ఇవ్వాలని నిలదీశారు.

జేఏసీ నాయకులు తుంగ కౌశిక్, వెంపటి అజయ్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు అండగా ఉంటానన్న ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, బల్మూరి వెంకట్, ప్రొఫెసర్ రియాజ్ ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజు, దినేశ్, అన్వేశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


జనగామలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు



మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి సురేఖ, పక్కన జీడబ్ల్యూఎంసీ మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్య శారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తదితరులు


ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో సామూహికంగా మొక్కలు నాటుతున్న మహిళలు

# సమష్టిగా మొక్కలు నాటాలి

- వరంగల్ జిల్లాను అగ్రగామిగా నిలపాలి
- అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ
- ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో వనమహోత్సవం


కాశీబుగ్గ, జూలై 11 : సమష్టిగా మొక్కలు నాటి వన మహోత్సవంలో వరంగల్ జిల్లాను అగ్రగామిగా నిలబెట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని 18వ డివిజన్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాంగణంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్‌తో కలిసి మంత్రి మొక్కలు నాటి పంపిణీ చేశారు. జీడబ్ల్యూఎంసీ, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు 75 ఏళ్ల క్రితం అప్పటి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి కేఎం మున్షీ వన మహోత్సవాన్ని ప్రారంభించారన్నారు. గత నెల 29న సీఎం రేవంత్‌రెడ్డి వజ్రోత్సవ లోగో ఆవిష్కరించి ఇక్కడి నుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 20 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యం కాగా, జిల్లాకు 24 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ప్రస్తుతం మొక్కలు నాటడంలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని, మొదటి స్థానానికి చేరేందుకు కృషి చేయాలన్నారు. ఆలోచన బాగున్నా ఆచరణ లేకపోతే ఫలితాలు దక్కవని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కోతులు అడవులకు పోవాలంటే పండ్ల మొక్కలు నాటాలని అటవీ శాఖ అధికారులను సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు మానవాళికి ముప్పు వాటిల్లుతుందన్నారు. వివిధ దుకాణాల యజమానులతో సమావేశమై ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. తొందర్లోనే గ్రేటర్ వరంగల్‌లో పెద్ద ఎత్తున అన్ని వర్గాల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, తహసీల్దార్‌లు, నాయకులు పాల్గొన్నారు.


తాను నాటిన మొక్క వద్ద సెల్ఫీ తీసుకుంటున్న కలెక్టర్ సత్య శారద

# సురేశ్‌బాబుకు అండగా ఉంటాం..

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసా
- న్యాయంజరిగేదా పోరాడుతామని స్పష్టం

తొర్రూరు, జూలై 11 : మాలోత్ సురేశ్‌బాబు కుటుంబానికి అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసా ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం భోజ్యతండా పరిధి ఈదులకుంట తండాకు చెందిన గిరిజన యువకుడు మాలోత్ సురేశ్‌బాబును పోలీసులు చితకబాదారని తెలుసుకున్న ఆయన గురువారం సాయంత్రం అతడి ఇంటికి వెళ్లారు. సురేశ్ కుటుంబసభ్యులను కలిసి అన్ని విధాలా అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి ఘటనకు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తానని వారికి హామీ ఇచ్చారు. అక్కడి నుంచే మహబూబాబాద్ ఎస్పీకు ఫోన్ చేశారు. సమగ్ర విచారణ జరుపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని దయాకర్‌రావు చెప్పారు.


సురేశ్‌బాబు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

## కమిషనరేట్ పరిధిలో 27 మంది ఎస్సైల బదిలీ

సుబేదారి, జూలై 11 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 27మంది ఎస్సైలు బదిలీ అయ్యారు. గురువారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండలో పని చేస్తున్న శ్రీనివాస్ ఐనవోలు, ఐటీ సెల్‌లో పని చేస్తున్న పురుషోత్తం నల్లబెల్లి, ఇక్కడ పని చేస్తున్న రామారావు సుబేదారి, వంగరలో పని చేస్తున్న వెంకటేశ్వర్లు దుగ్గొండి, ఇదే స్థానంలో పనిచేస్తున్న పరమేశ్వర్ వీఆర్, వీఆర్‌లో ఉన్న నగేశ్ నర్మెట, ఇక్కడ పనిచేస్తున్న శ్రీకాంత్ సుబేదారి, మట్టెవాడలో పనిచేస్తున్న కుమార్ గీసుగొండకు, మిల్స్‌కాలనీలో పనిచేస్తున్న శ్రీకాంత్ పరకాల, నర్సంపేటలో పనిచేస్తున్న ప్రవీణ్ ఆత్మకూరు, వీఆర్‌లో ఉన్న రామ్‌చరణ్ కేయూసీ, ఇక్కడ పని చేస్తున్న సురేశ్ వీఆర్, సుబేదారి మహిళా పీఎస్ ఎస్సై రాజన్‌బాబు వరంగల్ ట్రాఫిక్, సుబేదారిలో పనిచేస్తున్న సాంబయ్య సీసీఎస్ వరంగల్, హసన్‌పర్తి ఎస్సై సురేశ్ మిల్స్‌కాలనీ, మరో ఎస్సై రాజు సీసీఎస్ వరంగల్, వరంగల్ పీసీఆర్ కృష్ణమూర్తి సీసీఆర్‌బీ, వీఆర్‌లో ఉన్న హమీద్ నర్సంపేట, కేయూసీ ఎస్సై దేవేందర్ హసన్‌పర్తి, రాజేశ్‌కుమార్ వీఆర్, వీఆర్‌లో ఉన్న సిద్ధయ్య హసన్‌పర్తి, నినిషారెడ్డి వరంగల్ సీసీఎస్, ధర్మసాగర్‌లో పనిచేస్తున్న రాజు ఎస్‌బీ, సీసీఎస్‌లో పనిచేస్తున్న యాదగిరి వరంగల్ ట్రాఫిక్, ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన నజీర్, సారంగపాణి, రమేశ్‌ను ఎస్‌బీ విభాగానికి అలాట్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

